'నువ్వు కాదూ....?'

మధ్యాహ్నం వంటిగంటవుతుంది. రామస్వామి వాకిటిముందు బండి ఆపి ఎడ్లను విడిచిపెట్టి, వీధిలోనించే "ఇదోవ్!" అని భార్యను కేక వేసుకుంటూ ఇంట్లోకి నాలుగంగలుపెట్టి "నిన్నపొద్దు ననంగా తిన్నన్నం. కళ్లు తిరిగిపోతున్నయ్, తెల్లారింకా పచ్చిగంగైనా తాగలేదు, ఇంతపాడు బాడిగ ఎప్పుడూ తోల్లేదు. దబ్బున వీపుమీద రెండుచెంబులు నీళ్లుపోసి కంచంలో రెండు మెతుకులు వెయ్యే" అన్నాడు విసుగ్గా.

భార్య "అయ్యో! నిన్నట్నుంచీ అన్నం తినలే!" అంటూ త్వరత్వరగా వీపుమీద నీళ్లుపోసి దబ్బున వళ్లు తుడుచుకోమని తొందరచేసి భర్తకు అన్నంపెట్టింది.

యెడ్లు రెండూ చావట్లోకి వెళ్ళినవి. ఒకటి పుల్లదీ, ఒకటి తెల్లదిన్నీ. పుల్లది బక్కచిక్కి ఎముకలు బయటపడి వున్నది. తెల్లది దానికంటే కొంచంనయం. అవి గూడా మేత తిని ఒకరోజయింది, వాటికికూడా ఆకలి విపరీతంగా వేస్తూవుంది. పుల్లది త్రాణ లేకపోవడంవల్ల ఆకలికి నిలవలేక మరీతపించిపోతూవుంది. చెవులు దిబ్బెళ్ళుపడుతున్నవి. కాళ్లు భూమ్మీద ఆనటంలేదు. గాట్లో చూసింది, మేతలేదు. ఏది కనపడితే అది తిని వెయ్యాలనిపించింది దానికి.

తింటామని చావడికప్పు తాటాకు నోటితో లాగింది. అది ఎన్ని సంవత్సరాలనాటిదో, కుళ్ళి వుండడంవల్ల పట్టుకో గానే చూర్ణమయి పోయింది. ఎదురుగా అన్నం తింటూ యజమాని కనిపించాడు. దానికి ఒళ్ళు మండిపోయింది. "ఏం నీతోపాటేగా మేమూ తిన్నది. హాయిగా బండి మీద కూర్చున్న వాడికి నీకే అంత ఆకలివేస్తే గుండెలు పడలాగిన మాకు ఎట్లా వుండాలి?" అన్నట్టు అతనివంక చురచుర చూసింది. ముద్దమీద ముద్ద పొక్కుతూ అతని గొడవలో అతడున్నాడు. గానీ. వీటి సంగతి అతనికి పడితేగా మరి. కొంచందూరాన పచ్చగా చిక్కుడు పాదొకటి కనిపించింది దానిపంచ ప్రాణాలూ లేచివచ్చినవి.

రామస్వామి తృప్తిగా భోజనంచేసి తేపుకుంటూ చెయ్యి కడుక్కునేటందుకు ఇవతలకు వచ్చాడు.

పుల్లది చిక్కుడుపాదు తింటూవుండడం చూశాడు అతనికి కోపం ఎక్కిపోయింది. దొంగ ధనాన్ని దోచుకు వెళ్ళుతూవుంటే కర్రలు తీసుకుని వెంట తరిమినట్టు చేతులో చెంబు అక్కడనే పడవేసి ఎంగిలి చేత్తోనే గోడకు పెట్టివున్న కర్ర పుచ్చుకుని ఒక్కఉరుకు దూకి "బంగారంవంటి పాదు నీ పొట్టన పెట్టుకున్నావ్!" అంటూ ఈడ్చి ఈడ్చి రెండు వేశాడు.

కోపంతో ఎద్దు పాములాగా బుసలుకొట్టింది "బండి లాగిలాగి ఒళ్ళంతా హూనం అయివుంటే పైగా కొడతావా

దుర్మార్గుడా! ఆకలికి ఆగలేక రెండు ఆకులు కొరికితే నీ సొమ్మంతా పోయినట్టు బాదుతావా రక్కసుడా! నీ ప్రాణంవంటి ప్రాణం కాదూ నాది? నీ ఆకలివంటి ఆకలి గాదూ నాది? కష్టించి దున్ని పండిస్తే సారంఅంతా మీరు తీసుకుని మీకు పనికిరాని చెత్తను మాకు వెయ్యడాని కన్నా నీకు కష్టమైపోయిందా? నువ్వు మేత వేస్తే నేనీ పనెందుకు చేస్తాను. అంతమాత్రం తెలుసుకోలేవు మూర్ఖుడా" అని కళ్ళతో అన్నది యెద్దు.

అతడది గ్రహించుకోకుండా బాదుకుంటూ చావట్లోకి తోలుకవచ్చాడు. "ఎప్పుడు వేశావో వాటికి మేత వెయ్యి" అన్నది భార్య యింట్లో నించి. "దీన్ని నిలువునా తెగేసినా పాపంలేదు. పాదంతా తినివేసింది, కడుపు మురిగినట్టుంది. ఎంత పొగరుందనుకున్నావు దీని దగ్గిర. మేత వేస్తే ఇంకా మదం దిగుతుంది" అంటూ చెయ్యి కడుక్కుని రామస్వామి ఇంట్లోకి వచ్చి "కాస్త పక్క వెయ్యి, వుండివుండి తినడంవల్ల నిస్త్రాణగావుంది. కాళ్లు లాగుతున్నవి. నిద్ర జోగివస్తున్నది, కళ్లు మూతలు పడిపోతున్నవి" అన్నాడు.

భార్య భర్తకు పక్కవేసి చావట్లోకి వెళ్ళి రెండు ఎడ్లకూ పలుపువెట్టి ఇంత యెండుగడ్డి వాటిముందు వేసింది,

౭

ఆ తెల్లవారి శ్రీరామనవమి. రామస్వామి బజారు నుంచి రెండుమూడు పెద్దమూటలు బుజాన వేసుకుని ఇంటికి వచ్చాడు. ఆ మూటలను తెల్లదీ, పుల్లదీ చూసి తమ దానా వులవలని సంతోషపడ్డవి. "ఇదిగో వెచ్చాలు తెచ్చాను రాములవారికి ఇవ్వాళ మనం సేవచేద్దామని వాళ్ళతో చెప్పివేశాను. నిన్న వచ్చిన బాడుగ మూడు రూపాయిలూ స్వామివారి ఫలహారాలకు కానీ మిగలకుండా సరిపోయినవి. సమయానికి బాడుగ రావడం, ఇంత జనం వుండగా మనచేతనే సేవచేయించుకోవడం రాముడి దయ మనమీద యెలావుందో చూశావూ? ఎన్నాళ్ళనుంచో అనుకుంటాను సేవ చేయించాలని. మన ప్రయత్నా లక్కరకొస్తయ్యా మరి? వాడి అనుగ్రహంవస్తే చూడు ఎంతసేపో. ఈ గింజలు విసిరి నానపొయ్యి వడపప్పుకి. ఈ బెల్లందాయి పానకానికి" అన్నాడు భార్యతో.

పూజాద్రవ్యాలు సేకరించడానికీ, పిలవ్వాసిన పెద్దలను పిలవడానికీ,ఎంతో వుల్లాసంతో వురుకులుపరుగులు తీస్తున్నాడు రామస్వామి.

దీపాలు వెలిగించి ఒక గంటయింది. వేళ అవడంవల్ల రెండు ఎడ్లూ దానాకోసం ఎదురుచూస్తున్నవి. ఎంతసేపు చూసినా దానారాలేదు. వేళకు నల్లమందు వేసుకోని వాడిలాగా వాటికాళ్లు లాగుతున్నవి. వాటి బాధ ఎవరితో

చెప్పుకుంటవి? ఎలా తెలియజేస్తవి? ఆలకించే దెవరు? మనిషిపొడ కనపడితే చాలు బాధలో వున్నవాడు ఆప్తుడు కనపడితే చూసినట్టు ఎంతో ఆశతో దీనంగా చూస్తూ వున్నవి.

రాత్రి ఎనిమిది గంటలయింది. రాముస్వామి భజన శెట్టుచూ, రాములవారినీ తీసుకుని యింటికి వచ్చాడు. మద్దెలా, తాళాలూ, భజనపరుల నోళ్లూ పగిలిపోతున్నవి. ''జీవుడూ దేవుడూ ఒకటే జీవులను హింసించకే మనసా'' అన్న కీర్తన త్రికాలంమీద వెళ్ళిపోతూ వుంది. ఆ ధ్వనికి ఇంటి పెంకులు అదిరిపోతున్నవి. జీవితంలో చేయవలసిన ఘనకార్యం అదే అన్నట్టు. రామస్వామి ఉప్పొంగిపోతూ వినమ్రుడై దండలుకట్టి స్వామికి ఎదురుగా నిలుచుని అందరికీ భక్తిని ప్రదర్శిస్తూ ఆనందబాష్పాలు రాలుస్తున్నాడు.

అక్కడ తెల్లదీ, పుల్లదీ, వుసూరుమంటూ వేడి కళ్ళనీళ్ళు కారుస్తూ, మనగతి ఇంతే అన్నట్టు ఒకదాని ముఖం ఒకటి చూసుకుంటున్నవి.

ఫలహారం, పానకం పంచడం అయింది. భక్తులందరూ వెళ్ళిపొయ్యారు. అప్పుడు రాత్రి పదిన్నరగంట లయింది. భర్తకు అన్నం పెడుతూ ''అయ్యో! ఇవ్వాళ ఎడ్లకు వులవలు తేలేదు, ఈ సందట్లో మర్చిపొయ్యావు. నేనూ చెప్పడం మర్చిపొయ్యాను, ఇప్పుడు గుర్తువచ్చింది. పాపం అవి వుసూరుమంటూ వుంటవి'' అన్నది భార్య.

"నాకు గుర్తేవున్నది. డబ్బులేనప్పుడు ఏంచేస్తావు, వున్నడబ్బు కానీ మిగలకుండా ఫలహారాలకు సరిపోయె. ఒకరోజు లేకపోతే ఫరవాలేదులే. రోగమా! ఇటువంటి రోజు రేపు రమ్మంటే మళ్ళీ మనకు వస్తుందా? స్వామికి ఎంత ఖర్చుపెడితే అంతా మనకు కలగజేస్తాడు. మనం చెయ్యవలసిన పనిచేశాం, తర్వాత రాముడి దయ" అన్నాడు.

"ధర వచ్చిందని మేత గూడా అమ్మేస్తివి. ఇంట్లో దండిగా పడివుంటే ఇటువంటి సమయంలో ఒకమేత ఎక్కు-వెయ్యొచ్చు. డబ్బుపెట్టికొన్న మేత చూసి చూసి వాడవలసివచ్చే" అన్నది భార్య.

అప్పుడు అమ్మివెయ్యబట్టేగా వడ్డీ డబ్బులూ అవీ కలిసి కుర్రవాడి పెళ్ళికి అక్కరకొచ్చినయ్ సంసారం గొడవలు ఆడదానివి నీకేం తెలుస్తయి" అన్నాడు భర్త.

3

ఆ తెల్లవారి గుంటూరుకు బాడుగ వచ్చింది. బండి కట్టడానికి రామస్వామి. చావట్లోకి వెళ్లి రెండు ఎడ్లనూ లేవకొట్టాడు. తెల్లది లేచి నిలుచుంది, వుల్లది లేవలేదు. "రాత్రి దాణాలేక కాళ్లుతీస్తున్నవి ఇవ్వాళ్ళకు నేనులాగలేనబ్బా" అన్నట్టు అతనివంక చూసింది. "ఎహై నీవెద్దు కూల లేవదేరా" అంటూ కసురుకున్నాడు రామస్వామి.

"నిస్త్రాణకుతోడు అర్రుమీద పుండు కాకులు పొడవడంవల్ల ఎలా పచ్చుయిందో చూడు. ఇట్లావుంటే ఎట్లా లాగడం. నీకు జాలిలేదు?" అన్నట్టు మెడచాచి పుండును చూపించింది పుల్లడి. "లేవదేరా, దీన్ని నరక" అంటూ కర్రతో ఒక్కవేటు వేశాడతడు. దానికి ఎక్కడలేని కోపమూ వచ్చింది.

"కర్రపట్టుకో చాతవునని కొడతావా దుర్మార్గుడా! మీడొక్కలోకి గంజి యిస్తున్నది నేను. రారాజులకు రాజ్యాలిచ్చింది నేను. మీ ఐశ్వర్యాలన్నీ మా మలమూత్రాదుల్లోనించి వచ్చినయ్యే, తెలుసా? మీరు వట్టి దుర్బలులని జాలిపడి మీ సౌఖ్యంకోసం మా దేహాలను త్యాగం చేసేటందుకు నిశ్చయించాం. తోడి ప్రాణాలను సంరక్షించి మా జీవితాలను పవిత్రం చేసుకోడానికి దీక్ష పూనాం. మహారాజుల రత్నమకుటాలైనా మా కాలిగిట్టలకు సరిపోలవు, తెలిసిందా? మీరు స్వార్థపరులని యేనాడో గ్రహించాం. మా దేహాలను మనోవాక్కాయ కర్మల, ముందు మీకు సమర్పించివేశాం. మీరు కొట్టండి, కొయ్యండి—మా మాటను తప్పుకోలేం, మా శపథాన్ని వదులుకోలేం" అని తన సంజ్ఞలో తెలియజేస్తూ కోపాన్నంతా తగ్గించుకుని లేచి నిలబడ్డది. రెండిటినీ బండికికట్టి గుంటూరు తోలుక వెళ్ళి బండినిండా సరుకు వేసుకుని తిరిగి వస్తున్నాడు.

వెళ్ళేటప్పుడు కాళీబండి అవటంవల్ల హాయిగానే లాగినవి. వచ్చేటప్పుడు బియ్యం బస్తాలతో బండి పెటపెట లాడిపోతూవుంది. కాడి మెడమీద పెట్టడంతోనే పుల్లదానికి భారం అనిపించింది. అట్లాగే యీడుస్తూవున్నది. లాగడం ఆలస్యం అయితే పైనుంచి ముల్లుకర్రతో చెండుకు తింటున్నాడు యజమాని. పౌరుషంతో తనశక్తిని వెయ్యోభాగం గూడా దాచుకోకుండా ఎన్ని మైళ్ళవరకొస్తే అన్ని మైళ్ళూ లాగివేసింది. ఇక దానిదగ్గర చర్మం, ఎముకలుమాత్రమే మిగిలివున్నవి. లాగ లేక కూలబడిపోయింది.

తొట్లోనించి రామస్వామి అమాంతంగాదూకి చర్నాకోలతో బాదాడు. లేవలేదు. ''నీ తస్సాదియ్యా; దొంగెత్తు వేశావు'' అంటూ రెండు కర్రల సందునా తోకపెట్టి బలవంతాన అదిమి చిరతలు వేశాడు. సాంప్రదాయ ప్రకారం పెద్దలు సూక్ష్మబుద్ధితో యేర్పరచివుంచిన కర్మ కాండంతా జరిపాడు. బాధకు ఆగలేక వణికిపోయింది ఆ మూగజీవి.

''నన్ను చంపినా సరే, లాగలే''నన్నట్టు నోరు తెరిచి వూరుకుంది. తోడిప్రాణి దుస్థితిచూసి బిక్క మొగం వేసింది తెల్లది. దారినే పోతూవున్న రెండు ఆవులు అది పడే బాధచూసి అంబాఅని అరిచి సానుభూతి చెప్పివెళ్ళినవి. మార్గమధ్యంలో బండి ఆగిపోయింది. అతని కడుపు మండి పోయి కసిదీరా చేతులోబలం వున్నంతవరకూ దాన్ని

కర్రతో చితకపొడిచి వదిలిపెట్టాడు. "మీ మానవులు యింత రక్కసులా" అన్నట్టు చూస్తూ ఒళ్ళప్పగించి వూరుకుంది పుల్లది. గత్యంతరంలేక, బండినీ, ఎడ్లనూ అక్కడవుంచి ఒక్క పరుగులో దగ్గర పల్లెకువెళ్ళి ఒకళ్ళను బతిమలాడి ఎద్దును తీసుకవచ్చి బండికికట్టి వూరుచేరాడు.

౪

"పుల్లది ఎక్కడపడితే అక్కడ పండుకుంటున్నది. దాన్ని పెట్టుకుని నేనిక చెయ్యలేను బాబూ. ఇవ్వాళ్ళ యెంత అవస్థపడ్డా ననుకున్నావ్. దాన్ని పోగొట్టి మంచి దాన్ని కొనందిసాగదు" అని భార్యకు చెప్పి ఆ వేకువ ఝామునే పుల్లదాన్ని తోలుకుని పాలకుర్రు సంతకు వెళ్ళి ఇరవై రూపాయలకు అమ్మివేశాడు. మంచిదాన్ని కొనాలని సంతలో చూశాడు. అక్కడకు వచ్చినవన్నీ ఇటువంటి రకమే. తనకు నచ్చింది కనపడలా.

భోజనం వేళవడంవల్ల ఆ వూళ్ళో పాత చుట్టా లొకళ్ళింటే కలవేసుకుని వాళ్ళింట్లో భోజనంచేసి ఎండగా వుండడంవల్ల ఒక కునుకుతీసి ఇంటికి బయలుదేరాడు.

మార్గమధ్యంలో వక పల్లెదాటాలి. కర్ర మెడమీద వేసుకుని రెండుచేతులూ వ్రేళ్ళాడవేసి ఆ వూరు వెలపలగా దారినే పడి పోతున్నాడు. రామస్వామినోట్లో చుట్ట దివిటీ లాగా వెలుగుతూ వుంది. దూరాన తోపులో చెట్లపైన గద్ద లాడుతూ కనిపించినవి.

అవి యెందు కావుతున్నదీ వూహించుకోవడం అతనికి అనవసరం. అతని మనస్సు ఏ వూరుపోతే మంచిగిత్త దొరుకుతుందీ, ఎంత ఖరీదులో దొరుకుతుందీ అని పని చేస్తూవుంది. యింకా కొంతదూరం నడిచాడు.

ఆ గద్ద లాడుతూవున్న స్థలంనుంచే కుక్కల కవర్లాటలూ, కత్తులమోతలూ, వినవచ్చినవి. ఏదైతే మన కేంలే అన్నట్టు తలవంచుకుని నడుస్తూ తోపును సమీపించి దాని గుండా బాటనే పడిపోతున్నాడు.

“ఏమిరెయ్యోవ్! ఎక పోగుకి బాటా వుంటా వంటియ్యా” అని కేక వినవచ్చింది. తలయెత్తి చూశాడు. కొంతదూరంలో చెట్టుకింద ఒక పశువు చంపబడివుంది. నలుగురూ దానిచుట్టూ మూగి వున్నారు. ఆ మాటలకు అతనికి కోపం నెత్తికెక్కి పోయింది.

కళ్లెర్రజేసి “యెవడనుకున్నావోయ్, వళ్లూ పై తెలియకుండా మాట్లాడతావ్” అని ఎగిరి పడ్డాడు.

అందులోనించి ఒకడు లేచి “అరేయ్, ఇంద కటాయన్నా, మనిసిని తెలుసుకోకుండా అడగడమేటంట్రా” అని ఆ కేక వేసినవాణ్ణి మందలిస్తూ “దొరగోరూ కోప్పడకండి. కుర్రోడు తెలియక సూశాడు. యిదవను చీవాట్లు యేత్తాండాను” అన్నాడు.

పూర్వపరిచయం వున్నవాడిలాగా రామస్వామి అతన్ని చూసి గుర్తుపట్టాడు. అక్కడ తెగి పడివున్న తలకాయ చూశాడు. వంకర కొమ్ములు! ఉగ్రుడై పొయ్యాడు.

"ఛీ, గాడిదా! దాని ప్రాణం నిలువునా తీశావా? దాన్ని చంపేందుకు నీకు చేతు లెట్లా వచ్చినయ్ రా వెధవా! నిండు ప్రాణం తీసేందుకు నీ మనసెట్లా వప్పిందిరా రాక్షసుడా! నీజాతి కొందికీ చేశావ్. యింత దుర్మార్గులు కనకనే అంటడానికీ ముట్టడానికీ కూడా పనికిరాకుండా పొయ్యారు" అని ఏవేవో తిడుతూ మండిపడ్డాడు.

అక్కడ రక్తపు మడుగులో పడివున్న తలకాయ నాలిక వెళ్లపెట్టి "నన్ను చిత్రవధ చేసిచేసి నా ప్రాణాలు హరించింది నువ్వుకాదూ?" అన్నట్టు కళ్లు తేలవేసి రామస్వామికేసి చూస్తూవుంది.

ఆ చూపులు ఎవరి కర్థమవుతవి, మరి?